క్లుప్తంగా

తంగడంచలో చోరీ

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామానికి చెందిన పెద్ద గోవర్ధనయ్య (రిటైర్డ్ ఆర్మీ, ప్రస్తుతం ఎస్బీఐ గార్డు) ఇంట్లో శుక్రవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. వివరాలు.. గోవర్ధనయ్య ప్రస్తుతం కర్నూలులో నివశిస్తూ ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్‌లో గార్డుగా పనిచేస్తున్నాడు. ఈయనకు తంగడంచలో ఇల్లు ఉంది. శుక్రవారం సాయంత్రం గోవర్ధనయ్య భార్యాపిల్లలతో తంగడంచకు రాగా తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గ్రహించారు. ఇంట్లోని బీరువాను దుండగులు రాడ్డుతో పెకలించి 10 తులాల వెండి, పట్టుచీరలను దోచుకెళ్లినట్లు తెలిపారు. రూ.50వేల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

– అలాగే తంగడంచ చెక్‌పోస్టు సమీపంలో ఉన్న ధాబాలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి సిలిండర్, ఐరన్ పెన్నం దోచుకెళ్లినట్లు ధాబా యజమాని గోవర్ధన్ తెలిపారు. రూ.15 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ట్రిపుల్‌ఐటీకి ఎంపిక

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. నంద్యాల జిల్లా నుంచి విద్యార్థులు కె.నవీన్‌కుమార్, ఎస్.వంశీ, జి.వెంకటేష్, ఎమ్.వినయ్‌కుమార్, జి.రామకృష్ణ, ఎ.సుమంత్, కె.ఉమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం బీసీ గురుకుల పాఠశాలలో హెచ్‌ఎం బండ్లమూడి జవహర్ విద్యార్థులను అభినందించారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలి

జూపాడుబంగ్లా: రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని నంద్యాల డీఆర్‌సీ ఏడీ మంజులవాణి, బీటీఎం ఉమామహేశ్వరి, ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం జూపాడుబంగ్లాలో మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఏడీ, బీటీఎం మాట్లాడుతూ.. ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రస్తుతం మార్కెట్లో చిరుధాన్యాలైన కొర్రలు, మినుములు, పెసలు, సద్దలు, అరికెలు, తదితర తృణముల్ ధాన్యాలకు అధిక డిమాండ్‌తో ధరలు ఆశాజనకంగా ఉన్నట్లు తెలిపారు. చిరుధాన్యాల సాగువల్ల తక్కువ పెట్టుబడితో లాభాలు ఆర్జించవచ్చన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న కందులు, కొర్రల విత్తనాలను వ్యవసాయ కార్యాలయంలో పొందవచ్చన్నారు. అనంతరం రైతులకు ఉచితంగా కొర్ర విత్తనాలు పంపిణీ చేశారు. హార్టికల్చర్ అధికారి కాశీనాథం, ఆర్బీకేల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం కల సాకారం


కొడితే సిక్సరే.. బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి


దివ్యాంగ చిన్నారికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రజల ముంగిటకే పాలన చేరువ చేస్తూ వారికి అవసరమైన సేవలను సత్వరం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. సున్నిపెంటలోని గ్రామ సచివాలయం- 2లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా పాల్గొన్నారు. గ్రామవలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు మొత్తం 1,975కుగాను 1,499 కుటుంబాలను సర్వే చేసి ప్రజలకు అవసరమైన 591 సర్టిఫికెట్లను సిద్ధం చేశారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేతులమీదుగా వాటిని దరఖాస్తుదారులకు అందజేశారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ రాజేంద్రసింగ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టివెంకటరెడ్డి, నాయకులు ఎమ్‌ఏ రజాక్, జింకా గుండయ్యయాదవ్, ప్రముఖ రచయిత కాశీపురం ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని గ్రామ సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి 39 మంది వలంటీర్లు గృహాలను సరిగా మ్యాపింగ్ చేయకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహించే వలంటీర్లను విధుల నుంచి తొలగించాలని అధికారులను ఆదేశించారు. అలాగే జీఓ నంబర్ 40 వెలువడిన తేదీ నుంచి జలవనరుల శాఖ అధికారులు ఎలాంటి అధికారిక చర్యలు చేపట్టినా చెల్లుబాటు కావని, నూతనంగా మంజూరు చేసిన గృహాలు, స్థలాల అలార్ట్‌మెంట్లపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు పిర్యాదు చేశారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సున్నిపెంటలో క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. కొద్ది సేపు సరదాగా బ్యాటింగ్ చేశారు. పూర్వ విద్యార్థులు మగ్బుల్ హుస్సేన్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో కోనేరుల మరమ్మతులు

మహానంది: మహానంది దేవస్థానంలో కోనేరుల మరమ్మతులు మూడు నెలల్లో పూర్తి చేస్తామని, దేవదాయ శాఖ డీఈ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. రూ.80 లక్షలతో చేపట్టిన కోనేరుల మరమ్మతు పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు డీఈ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ దేవదాయ శాఖ, అమృత్ సరోవర్ పథకం ద్వారా రుద్రగుండం, బ్రహ్మ, విష్ణుగుండం కోనేరులలో పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే జిల్లాలోని రంగాపురం మద్దిలేటిస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. పలు గ్రామాల్లో పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయని వివరించారు. అనంతరం కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు.


పనులు పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాసప్రసాద్

అసైన్డ్ భూములపై హక్కులు కల్పించడం చరిత్రాత్మకం


మాట్లాడుతున్న ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్.రమణ, హౌసింగ్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి

పగిడ్యాల: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అసైన్డ్ భూములకు భూ యాజమాన్య హక్కులు కలిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణ, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అలాగే బస్టాండులోని దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం వల్లరాష్ట్రంలోని పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులకు లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో లక్షలాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు నిండాయని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వనజ, రాజు, ఉదయ్‌కిరణ్‌రెడ్డి, జయభారత్‌రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం, వార్డెన్‌కు తాఖీదులు

శ్రీశైలం: శ్రీశైలం పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రారెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటశాలను పరిశీలించి విద్యార్థుల భోజనం కోసం తెచ్చిన కూరగాయల్లో నాణ్యత లేకపోవడం, పరిసరాల అపరిశుభ్రతపై హెచ్‌ఎం, వార్డెన్‌కు తాఖీదులు జారీ చేశారు. నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విధులు నిర్వహనలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


కూరగాయల నాణ్యతను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీడీ రవీంద్రారెడ్డి

రాకపోకలకు అంతరాయం

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామం వద్ద ఉన్న రైల్వేగేటు మరమ్మతుల కారణంగా రెండ్రోజుల పాటు గేటు మూసివేయనున్నట్లు పీడబ్ల్యూ వెంకటేశ్వర్లు తెలిపారు. శని, ఆదివారాల్లో గేటు మూస్తారని, వాహనదారులు, ప్రయాణికులు గమనించాలని కోరారు.

సురక్షతో సులభంగా ధ్రువపత్రాలు


నందికొట్కూరులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. నందికొట్కూరులోని మారుతీనగర్ 12 వార్డు 7వ సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు లాలుప్రసాద్ పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. 560 మందికి వివిధ సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

మిడుతూరు: మండల పరిధిలోని బైరాపురం గ్రామానికి చెందిన నగిరె రాజారెడ్డి శుక్రవారం తన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా రఘురామయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాముడు, శ్రీనివాసులు, పేరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చెరుకుచెర్ల రగురామయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నగిరె రాజారెడ్డి

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు శుక్రవారం పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వ్యంలో వేదపండితులు, అర్చకులు స్వామి, అమ్మ వారి ఉత్సమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు చేసి గోమాతకు పూజలు జరిపారు. ఆలయ ప్రాకారాల్లో పల్లకీ సేవ కనులపండుగగా జరిగింది. ఆలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, ఇన్‌స్పెక్టర్ రంగన్న, భక్తులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి

పాములపాడు: వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి హేమలత, వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాక కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి రైతు పంటల బీమా నమోదు చేయించుకోవాలన్నారు. సాగు విస్తీర్ణం, పీఎం కిసాన్, పొలంబడి తదితర అంశాలపై చర్చించారు. జిప్సం, జింక్, టార్పాలిన్ పట్టలు సబ్సిడీలో ఇవ్వాలని, అలాగే ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లు వ్యక్తిగతంగా రైతులకు ఇవ్వాలని కమిటీ సభ్యులు కోరారు. పశు వైద్యాధికారి అనిల్, కమిటీ ప్రెసిడెంట్ రఘురామిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

వెలుగోడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో గల సమస్యలపై చర్చించారు. ఆర్బీకేల పరిధిలో రైతులకు విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు ఏఓ పవన్‌కుమార్ తెలిపారు. కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం వీఆర్వోల వద్ద అర్జీ పెట్టుకోవాలన్నారు. గ్రామీణ విత్తన పథకం కింద వెలుగోడు మండలానికి 11 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. సెరికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ రాజశేఖర్, వెటర్నరీ డాక్టర్ సుధాకర్ రెడ్డి, ఏఈఓ సుధారాణి, వీఏఏ శివ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు రామాంజనేయులు, మునిస్వామి పాల్గొన్నారు.

విత్తన విక్రయాలపై నిఘా పెట్టండి

కొత్తపల్లి: మండలంలో అనుమతి లేని విత్తనాల విక్రయాలు జరగకుండా ఆర్‌బీకే సిబ్బంది నిఘా పెట్టాలని ఆత్మకూరు ఏడీఏ బి.ఆంజనేయ సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో దళారులు నాసిరమైన విత్తనాలను అమ్మకుండా సిబ్బంది జాగ్రత్తగా ఉండాలన్నారు. కౌలు కార్డు అవశ్యకత, సీహెచ్‌సీ గ్రూపుల ఏర్పాటు, వ్యవసాయంలో మెలకువలపై అవగాహన కల్పించారు.ఏఓ మహేష్, ఉద్యాన, మత్స్య శాఖ, పకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ సలహామండలి సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ గ్రామ సభలు

మహానంది: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీలో భాగంగా బండిఆత్మకూరు మండలంలోని గ్రామాల్లో గ్రామసభలు జరుగుతున్నట్లు ఎంపీడీఓ వాసుదేవ గుప్త తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పరమటూరు, సోమయాజుల పల్లె, ఏ.కోడూ రు, ఈర్నపాడు, జీసీ పాలెం గ్రామాల్లో సభలు నిర్వహించారు. అబ్జర్వర్లుగా ఎంఈఓలు యశో ధ, మోహన్‌రెడ్డి ఏపీఓ వసుధ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నందికొట్కూరు: నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియాల ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు, పగిడ్యాలలో నిర్మించిన ఇండోర్ స్టేడియాలను ప్రారంభించేందుకు మంత్రి ఆర్‌కే రోజా శనివారం వస్తున్నట్లు తెలిపారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కృషితో రూ.2.38 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియంలు నిర్మించినట్లు చెప్పారు. ప్రారంభోత్సవంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నంద్యాల, కర్నూలు జిల్లాల శాప్ కో-ఆర్డినేటర్లు రవికుమార్, శ్రీనాథ్, స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ రాజు, జడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, సర్పంచు నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.